కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైలం జలాశయానికి జలకళ

- ఎగువన కర్ణాటక నుంచి కృష్ణానదిలో కొనసాగుతున్న వరద
- రిజర్వాయర్‌లో 125 టీఎంసీలకు చేరువైన నీరు
- ఈ సారి జూన్ నెలలోనే సగానికి పైగా నిండిన శ్రీశైలం జలాశయం
- కేఎల్‌ఐ కింద ఆయకట్టుకు సీజన్ ముందు నుంచే నీటి సరఫరాకు అవకాశం

సాక్షి, నాగర్‌కర్నూల్: ఈసారి వానాకాలం సీజన్ ప్రారంభంలోనే కృష్ణానది నీటితో కళకళలాడుతోంది. ఎగువన కర్ణాటక ప్రాంతంలో కురిసిన వర్షాలకు వస్తున్న వరద నీటితో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. జూరాల ప్రాజెక్ట్ నిండటంతో గేట్లు ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం రిజర్వాయర్ శరవేగంగా నిండుతోంది. శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తిస్థాయి సామర్థ్యం 215.80 టీఎంసీలకు శుక్రవారం నాటికి 125.1322 టీఎంసీలకు చేరింది. సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో ఈస్థాయి నీటిమట్టానికి చేరుకునే ఈ ప్రాజెక్టులో ఈసారి జూన్ నెలలోనే జలాశయం సగానికి పైగా నిండటం విశేషం.

➡ వారం రోజులుగా కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్ట్‌ల నుంచి జూరాల జలాశయానికి నీటి వరద కొనసాగుతోంది. ప్రస్తుతం జూరాలలో 7.371 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు. జూరాల ఆయకట్టుతో పాటు భీమా, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్, ఆర్డీఎస్ లింక్ కెనాళ్లకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్ట్ నుంచి దిగువకు 1.14 లక్షల వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయంలో గరిష్ట నీటిమట్టం 885 అడుగులకు ప్రస్తుతం 865.7 అడుగుల ఎత్తుకు చేరుకుంది. ఇంకా వర్షాలతో పాటు వరద కొనసాగితే మరో 10–15 రోజుల్లోనే శ్రీశైలం రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈసారి ముందుగానే ఆయకట్టుకు నీటి సరఫరా..

జూన్ మాసంలోనే కృష్ణానదిలో నీటి ప్రవాహం పెరగడంతో సాగునీటి ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. ఈసారి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద మొత్తం 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ కింద 29వ ప్యాకేజీ విస్తరణ పనులు సైతం కొనసాగుతున్నాయి. ఇప్పటికే శ్రీశైలం జలాశయానికి భారీగా నీరు వస్తుండడంతో కేఎల్‌ఐ కింద ఆయకట్టుకు ముందస్తుగానే సాగునీరు అందించేందుకు వీలుంది. జూరాల ప్రాజెక్ట్ ఇప్పటికే నిండటంతో ప్రాజెక్ట్ ఆయకట్టుకు నీటి విడుదల ప్రారంభమైంది.


పెంట్లవెల్లి మండలం మంచాలకట్టలో కృష్ణమ్మ పుష్కరఘాట్ వరకు చేరిన నీరు


శ్రీశైలం జలాశయంలో పెరిగిన నీటి మట్టం

మూడు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి..

ఈసారి ముందుగానే కృష్ణానదిలో నీటి ప్రవాహం అందుబాటులో ఉండటంతో కేఎల్‌ఐ ద్వారా ఆయకట్టుకు నీరందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎల్లూరు వద్ద పంప్‌హౌస్‌లో మూడు మోటార్లు అందుబాటులో ఉన్నాయి. ఎప్పటికప్పుడు నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

మరమ్మతులు పూర్తయితేనే పూర్తిస్థాయి వినియోగం

కృష్ణానదిలో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ కేఎల్‌ఐ కింద పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించాలంటే మోటార్ల మరమ్మతులను వేగంగా పూర్తిచేయాల్సి ఉంది. కేఎల్‌ఐ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎల్లూర్ పంప్‌హౌస్‌లో మొత్తం ఐదు మోటార్లకు రెండు మోటార్లు రిపేర్‌లో ఉన్నాయి. 3వ, 5వ మోటార్లు గతంలోనే పాడవగా, వీటి మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.14 కోట్లు కేటాయించింది. మోటార్ల రిపేరు పనులు కొనసాగుతున్నాయి. సీజన్ ప్రారంభం అయ్యే నాటికి మోటార్లను సిద్ధంగా ఉంచుతామని అధికారులు చెబుతున్నారు. కేఎల్‌ఐ కింద పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించాలంటే మోటార్ల మరమ్మతును పూర్తిచేయాల్సి ఉంది. కేఎల్‌ఐ రిజర్వాయర్ల సామర్థ్యం టీఎంసీ కన్నా తక్కువగా ఉండటంతో ఎక్కువ నీటిని స్టోరేజీ చేసుకునే అవకాశం లేదు. అందువల్ల ప్రతి వారం రోజులకు ఒకసారి మూడు రిజర్వాయర్లను నింపుకోవాల్సి ఉంటుంది. అలాగే మిషన్‌భగీరథ నీటి సరఫరాతో పాటు సాగునీటి సరఫరాకు మోటార్ల ద్వారా నిరంతరం నీటి ఎత్తిపోతలను కొనసాగించాల్సి ఉంది.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తే!

- మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ హేమలత


గట్టులో వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న అధికారులు

గట్టు: మత్తు పదార్థాలు ఎంతటి వారినైనా వివక్షణ కోల్పోయేలా చేస్తుందని, ముఖ్యంగా నేటి యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటై జీవితాలను చిత్తు చేసుకోవద్దని మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ హేమలత కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం దగ్గర మాదకద్రవ్యాలపై అన్ని శాఖలకు చెందిన అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ హేమలత, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. మత్తు అప్పటికప్పుడు కిక్కు ఎక్కించినా, నియంత్రణ కోల్పోయి మనం ఏం చేస్తున్నామో తెలియకుండానే అనర్థాలకు కారణమవుతామని తెలిపారు. విద్యార్థులు, యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ సంధ్యారాణి, బ్యాంకు మేనేజర్, జూనియర్ అసిస్టెంట్లు వజ్రమ్మ, జయలక్ష్మి, గణేష్, భరణి, రికార్డు అసిస్టెంట్ గోపాల్, అంగన్‌వాడీ టీచర్ వెంకట్రావమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

అయిజ: మండల కేంద్రంలో ఎక్లాస్‌పురం రోడ్డు పక్కన పేద వారికి ఇచ్చిన ఇంటి స్థలాలకు మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం బీజేపీ నాయకులు ప్రభుత్వం పేదవారికి కేటాయించిన ఇళ్ల స్థలాలను పరిశీలించారు. పేదవారికోసం 24 యేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం పేదవారికి ఇళ్ల పట్టాలు ఇచ్చిందని, అధికారులు ఇప్పటి వరకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ముళ్ల పొదలు దట్టంగా వ్యాపించాయని, దాని వల్ల విష సర్పాలు సంచరిస్తున్నాయని వాపోయారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినా వాటికి విద్యుత్ తీగలు అమర్చలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భీమసేన రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రదీప్ కుమార్, లక్ష్మణ్ గౌడ్, నాగరాజు, ఓబుల్ రెడ్డి, వీరయ్య ఆచారి, వేరేష్ గౌడ్, నరసింహులు పాల్గొన్నారు.


ఇంటి స్థలాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

- ఎమ్మెల్యే విజయుడు

రాజోళి: నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. శుక్రవారం రాజోళి, వడ్డేపల్లి మండల కేంద్రాల్లో విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాస్త్రవేత్తల పరిశోధనలో, విత్తనాలను పరిశీలించి, రైతులకు అందిస్తున్నారని అలాంటి విత్తనాలను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. ప్రతి రైతు కూడా వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రైతులకు కంది, జొన్నల విత్తనాలను మినీ ప్యాకెట్ల రూపంలో అందించారని, దాని ద్వారా రైతులు నాణ్యమైన పంటలను పండించే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల వ్యవసాయ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

అలంపూర్: కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన యజ్ఞం లక్ష్మీదేవి సీఎం వైద్య ఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సీఎం సహాయ నిధి ద్వారా రూ. 1.75 లక్షల చెక్కు మంజూరైనట్లు తెలిపారు. ఎమ్మెల్యే అబ్దిదారులకు చెక్కును అందజేశారు. వీరితోపాటు జిల్లా మత్స్య సహకారం సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్, మాజీ కౌన్సిలర్ ఇంతియాజ్ అలీ, నాయకులు రఘురెడ్డి, మురళి గౌడు, తదితరులు ఉన్నారు.


విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

నీటికోసం ప్రజల ఇబ్బందులు



ఇటిక్యాల: మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో మిషన్ భగీరథ పథకం నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాలకు రెండు మూడు రోజులకోసారి నీటి సరఫరా అవుతున్నా ప్రజలకు సరిపోవడంలేదు. దీంతో చేతి పంపులు, వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు నీటి కోసం పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి నీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం

ఉండవెల్లి: మండలంలోని బొంకూరు గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎస్‌బీఐ భవిష్యభారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 276 మందికి ఉచిత వైద్య పరీక్షలు డా.మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో దగ్గు, జ్వరం, గుండెలో నొప్పి, మెదుడు ట్రెస్‌పై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, క్యాతూరు పీహెచ్ సిబ్బంది, ప్రాజెక్ట్ మేనేజర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని శివాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహులు ఆధ్వర్యంలో రాత్రి కుంకుమార్చన పూజలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

పట్టణాభివృద్ధికి కలిసికట్టుగా కృషి



ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు కలిసికట్టుగా పట్టణాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని దోమల నివారణకు కృషి చేయాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. డ్రైడే ఫ్రైడే, 100 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారుశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కుక్కకాటుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నివారణ, తదితర అంశాలపై క్లుప్తంగా కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎద్దుల బండ్ల గిరక పోటీలు

కేటీదొడ్డి: మండలంలోని కుచినెర్ల గ్రామంలో మట్టి ఎద్దుల అమావాస్య పండుగ సందర్భంగా శుక్రవారం ఎద్దుల బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ వైస్‌ఎంపీపీ రామకృష్ణ నాయుడు, వెంకట కిషన్ రావులు హాజరై బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మెదటి బహుమతి రూ. 20,016, రెండో బహుమతి రూ.15,016, మూడో బహుమతి రూ. 10,016, నాలుగో బహుమతి రూ.8,016, ఐదో బహుమతి రూ.6,016లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పట్టయ్య, ప్రసాద్, నర్సింహులు శెట్టి, తిక్కన్న, ప్రజలు పాల్గొన్నారు.


ఎద్దుల బండ్ల గిరక పోటీలు ప్రారంభించిన మాజీ వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు

‘బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యే శరణ్యం’

అమరచింత: మన ఊరు–మనబడి ద్వారా మంజూరైన డైనింగ్ హాల్ కిచెన్, బాత్రూంలు నిర్మించినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం చెల్లించలేదని, బిల్లులు ఇవ్వకుంటే ఆత్మహత్యే శరణ్యమని కాంట్రాక్టర్ రాముల శ్రీనివాసులు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తాను నిర్మించిన భవనాల ముందు కుటుంబ సభ్యులతో కలిసి నల్లబ్యాడ్జీలు దరించి నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని మస్తీపురం గ్రామానికి చెందిన రాముల శ్రీనివాసులు గతేడాది మన ఊరు–మన బడిలో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్డి నిర్మాణాలకు రూ.18.50లక్షలు వెచ్చించారు. బిల్లులు ఇవ్వమని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించకపోతే తాను నిర్మించిన భవనాల ముందే కుటుంబంతో కలిసి ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు

పరిమితికి మించి ప్రయాణం

మల్దకల్: గూడ్సు వాహనాలలో ప్రయాణికులను చేరవేస్తూ ప్రైవేట్ వాహనదారులు ప్రజలను ప్రమాదాలకు గురిచేస్తున్నారు. ప్రతినిత్యం కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాలకు కూలీలను ఎక్కించుకుని వస్తున్నారు. ఒక్కొక్క వాహనంలో దాదాపు 20నుంచి 40మందికి పైగా ప్రయాణికులను చేరవేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వివిధ గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రైవేట్ వాహనదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మల్దకల్‌లో పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న బొలెరో

గర్భిణులు షోషకాహారం తీసుకోవాలి

మల్దకల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వర్షకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, వెంకటస్వామి, జ్యోతి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు


అబ్దుల్ హాజీ(ఫైల్)

మానవపాడు: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో అదృశ్యమైన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మానవపాడు మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ హాజీ, భార్య తస్లీం బేగంతో కలిసి నివాసముంటున్నారు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి మళ్లీ కొన్ని రోజులకు తిరిగి వచ్చేవాడు. ఇలా 10 సార్లకు పైగా ఇంటి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లి తిరిగి ఇంటికొచ్చేవాడు. భార్య ఎందుకు వెళ్తున్నావని అడిగితే భర్త ఏమి చేప్పేవాడు కాదు. అలాగే 4నెలల క్రితం (ఫిబ్రవరి నెలలో) అబ్దుల్ హాజీ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. మళ్లీ తిరిగి రాలేదు. దీంతో భార్య మానవపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

జాతీయ రహదారిపై ప్రమాదం

మానవపాడు: జాతీయ రహదారి–44పై పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం సడెన్ బ్రెక్ వేయడంతో ఒకదాని తర్వాత మరొక వాహనం ఢీ కొట్టిన సంఘటన శుక్రవారం బోరవెల్లి శివారులోని చోటుచేసుకుంది. స్థానికుల, పెట్రోలింగ్ సిబ్బంది కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు సడెన్‌బ్రెక్ వేసింది. దీంతో వెనకాల వస్తున్న బొలెరో, కారు, మినీబొలెరో వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. సంఘటనా స్థలానికి పోలీస్‌లు వెంటనే వచ్చి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూశారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని కార్మికులను చలో హైదరాబాద్ ధర్నాకు బయలు దేరుతున్న వారిని పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. అనంతరం శుక్రవారం కార్మికులకు కనీస వేతనం ఇవ్వడం లేదని కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) 4వ మహాసభను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జమ్మిచెడు కార్తీక్, కార్మికులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



ఎర్రవల్లి: మండలంలోని కొండేరులో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సోమనాద్రి ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి రాజు, నాయకులు వెంకటేష్, బీచుపల్లి, ప్రతాప్, ఈదన్న, బీమేష్, కమిటీ సభ్యులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి

అయిజ: నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెస్ యూత్ లీగ్ జిల్లా అధ్యక్షుడు దానయ్య, జిల్లా కార్యదర్శి హరీష్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వారిపై శ్రీ కృష్ణవేణి పాఠశాల బస్సు డ్రైవర్లు అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

పల్లెల్లో మొదలైన పీర్ల పండుగ

అమరచింత: మొహర్రం నెల పురస్కరించుకుని గ్రామాల్లో పీర్ల పండుగ మొదలైంది. శుక్రవారం గ్రామాల్లోని పీర్లచావిడిలో పీర్ల పెట్టెలను భక్తిశ్రద్ధలతో ప్రార్థించి కిందకు దించారు. పట్టణంలోని పెద్దపీర్ల మసీదులో ముజావర్లు గ్రామ పెద్దల సమక్షంలో పెట్టెలను కిందకు దించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శనివారం నుంచి పీర్ల చావిడిలో ఆలంను కూర్చోబెట్టి పది రోజుల పాటు పీర్ల పండుగ నిర్వహిస్తారని ముజావర్లు తెలిపారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

అమరచింత: పరిసరాల పరిశుభ్రతతో ప్రజలు ఆరోగ్యకరమైన జీవితం పొందుతారని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో మురుగు శుభ్రత, పాతతొట్టెలలో నిల్వ ఉన్న వర్షపు నీటిని తొలగించుట, బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరు తమ వంతుగా చేయాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



మానవపాడు: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి ఎంపీడీఓ భాస్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు సేకరించి స్థలాలను పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ నీరు సరఫరా చేయండి



మానవపాడు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని బోయ చిన్న అయ్యన్న శుక్రవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీసీ కాలనీలో బోయ వీధి నుంచి మిషన్‌భగీరథ 4 ఇంచుల పైప్‌లైన్, బోయవీధి పైవీధిలో 2ఇంచుల పైపులు పెట్టారని, నీరు సరిగా రావడం లేదని, వాల్ పెడితే బాగుంటుందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధితులకు పరామర్శ



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రాఘవేంద్ర మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందింది. అనంతరం దాబా శ్రీనివాసులు ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ మాజీ చైర్మన్ సరిత శుక్రవారం బాధితులను పరామర్శించారు. వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆమె వెంట నాయకులు ఆనంద్‌గౌడు, మహానందిరెడ్డి, రామన్‌గౌడు, వీరన్న, గోవిందు, తదితరులు ఉన్నారు.

తిరుమలలో తుపత్రాల భజన మండలి



అయిజ: తిరుమలలో నిర్వహిస్తున్న అఖండ హిరనామ సంకీర్తనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామానికి చెందిన మారుతి భజన మండలి బృందం శుక్రవారం స్వామివారి సన్నిధిలో భజనలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు భజన మండలి బృందాన్ని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు చిన్న వెంకటన్న, అశోక్ కుమార్ గౌడ్, హనుమంతు, రామాంజనేయులు గౌడ్, పెద్ద అశోక్ కుమార్ గౌడ్, వీరేందర్, మధు, వీరేష్ పాల్గొన్నారు.

సెలక్టెడ్ కమిటీ మెంబర్‌గా చక్రవర్తి



అయిజ: దూప దీప నైవేద్య అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న చక్రవర్తి ఆచార్యులు డీడీఎస్‌ఎస్ వెరిఫికేషన్‌లో భాగంగా సెలక్టెడ్ కమిటీ మెంబర్‌గా ఎంపికయ్యారు. అర్చకులకు నాలుగు నెలలుగా జీతాలు రావడం లేదని, దేవాదాయ శాఖ నుంచి అర్చకులకు వెంటనే జీతాలు చెల్లించాలని ఈ సందర్భంగా చక్రవర్తి కోరారు.

ఎర్రమట్టి తరలింపు నిలిపివేత

మానవపాడు: మండలంలోని పల్లెపాడు గ్రామంలో శుక్రవారం పాత పల్లెపాడు గ్రామం నుంచి కొత్త పల్లెపాడుకు ట్రాక్టర్ల ద్వారా అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్నారని సమాచారం ఉన్నతాధికారులకు చేరవేశారు. దీంతో వెంటనే పోలీసులు స్పందించి పల్లెపాడు గ్రామానికి వెళ్లి ఎర్రమట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. నిబంధనల ప్రకారం ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోని ఎర్రమట్టిని తరలించాలని వారికి సూచించారు.